నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 24 జనవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

గ్రామ సభల్లో రణరాగం

జంగమాయిపల్లిలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- మాగనూరు మండలం నేరడగంలో ఇండ్ల రద్దుకు తీర్మానం
- ధర్మాపూర్ వాసుల్లో కట్టలుతెంచుకున్న ఆగ్రహం
- నవాబ్‌పేట మండలం దొడ్డిపల్లి ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి
- మద్దూరులో కాంగ్రెస్, బీఆర్ఎస్ వాగ్వాదం

- మూడో రోజు నిరసనలు.. నిలదీతలు
- గ్యారెంటీ లిస్టుల్లో అర్హుల పేర్లేవని ఆసహనం
- పలు చోట్ల అర్హుల జాబితా తారుమారు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గందరగోళం

మహబూబ్‌నగర్ జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీల అమలు కోసం చేపట్టిన గ్రామసభలు నిలదీతలు.. నిరసనల మధ్య కొనసాగుతున్నాయి. గ్రామసభ ప్రారంభం కాగానే జనం ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అర్హుల జాబితాలను గ్రామసభలో ఆమోదించాల్సి ఉండగా ఆ జాబితాలను పక్కకుపెట్టి కొత్త దరఖాస్తులు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల అర్హుల జాబితాలు గ్రామసభలో ప్రకటిస్తున్న జనం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. దీంతో భయపడిపోయిన అధికారయంత్రాంగం అర్హుల జాబితాలను తొక్కిపెట్టి తూతూ మంత్రంగా గ్రామసభలను నిర్వహిస్తోంది. గురువారం జరిగిన గ్రామసభలు గరం గరంగా సాగాయి. మూడో రోజు జరిగిన సభలకు హాజరైన ప్రజలు ప్రభుత్వ పథకాల జాబితాల్లో అర్హుల పేర్లు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులకు పెద్దపీట వేశారని మండిపడ్డారు. పలు చోట్ల జాబితాలు కూడా తారుమారైట్లు ఆరోపించారు. దీంతో ఎక్కడ చూసినా నిలదీతలు.. నిరసనలే కొనసాగాయి. సభలు ప్రారంభం కాగానే అధికారులపై జనం ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో సభలన్నీ ఆందోళనలతో అట్టుడికిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా ధర్మాపూర్‌లో ఏకంగా అధికారులను జనం బండబూతులు తిట్టినంత పని చేశారు. దేవరకద్రలో గ్రామ సభకు వచ్చిన అధికారులను వెనక్కి పంపించారు. మరికొన్ని చోట్ల గ్రామసభలు వద్దు అంటూ ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటించిన గ్రామాల్లో భారీ బందోబస్తు నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం మరిన్ని ఆందోళనలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యేలు ఒకటి రెండు గ్రామసభలకే పరిమితం అవుతున్నారు. విపక్ష ప్రజాప్రతినిధులను గ్రామసభలను ఆహ్వానించడం లేదు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కరెంట్ బిల్లులు, వంట గ్యాస్ సబ్సిడీ, కొత్త రేషన్ కార్డు జారీ, రూ.4 వేల పింఛన్‌పై అధికారులను కడగిపడేశారు. కొకుంట్ల మండలం రేకులపల్లిలో గ్రామస్తుల ఆగ్రహానికి అధికారులు వెనుదిరిగారు. నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యేను నిలదీయడంతో పాటు పథకాలపై లొల్లి జరిగింది. మద్దూరు మండలం మోమినాపూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. మాగనూరు మండలం నేరెడుగంలో ఏకంగా గ్రామసభను రద్దు చేస్తూ తీర్మానం చేశారు. గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో గ్రామ సభను బహిష్కరించారు. నవాబ్‌పేట మండలం దొడ్డిపల్లి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్(మేట్) పిచ్చకుంట్ల చంద్రయ్యపై దాడి జరిగింది. ఆయన ఆత్మీయభరోసా, రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితా చదువుతుండగా అదే గ్రామానికి చెందిన కొందరు అనర్హుల పేర్లు రాశారని, నిజమైన లబ్ధిదారులకు మొండిచేయి చూపారంటూ తీవ్ర ఆగ్రహానికి గురై ఫీల్డ్‌అసిస్టెంట్‌పై దాడి చేశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నారు.

మహబూబ్‌నగర్‌లోని దోబీవాడలో నిలదీస్తున్న మహిళలను వారిస్తున్న పోలీసు

గ్రామసభల్లోని దరఖాస్తులు

ప్రభుత్వం ఆత్మీయ భరోసా కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలకు గ్రామసభల్లోని పెద్ద ఎత్తున జనం దరఖాసులు చేసుకుంటున్నారు. తమకు గ్యారెంటీ స్కీములు వస్తాయో ? రావో? అన్న అనుమానంతో ప్రజలు ఆధార్ కార్డులు జిరాక్స్ పేపర్లతో పాటు రేషన్ కార్డులు ఇతర వాటికోసం భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. కాగా గ్రామసభల్లో దరఖాస్తులు చేస్తున్నప్పటికీ అవి పరిగణలోకి తీసుకుంటారా? లేదా? అనేది అనుమానంగా మారింది. మరోవైపు ఈ పథకాల్నీ ఈనెల 26 నుంచి అమలు చేస్తామని చెబుతుండడంతో రెండు రోజుల్లోనే అర్హులైన వారికి ఈ పథకాలు అందజేస్తారా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. మరోవైపు ఎమ్మెల్యేలు అర్హులకే కేటాయిస్తామని చెబుతున్నప్పటికీ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మొత్తంపైన ప్రభుత్వం చేపట్టిన గ్యారెంటీ స్కీములకు గ్యారెంటీ లేకుండా పోయిందని జనం పెదవి విరుస్తున్నారు.

పోలీసు పహారా మధ్య..

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుకు దాదాపు 15 నెలల తర్వాత ఏర్పాటు చేస్తున్న గ్రామసభలు రచ్చకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీ స్కీముల్లో అర్హుల పేర్లు గల్లంతు కావడంతో ఈ సభలన్నీ పోలీసుల పహారా మధ్యనే కొనసాగుతున్నాయి. ఇక మంత్రులు ఎమ్మెల్యేలు గ్రామాల్లోకి వెళ్లాలంటే పోలీసుల భద్రత లేనిది వెళ్లడం లేదు. సమస్యాత్మక గ్రామాల్లో కూడా పోలీసుల బందోబస్తుతో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల ఘర్షణలు పడుతుండగా మరి కొన్ని చోట్ల అధికారులను తిట్టినంత పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రామసభకు ఇన్‌చార్జిగా వ్యవహరించాల్సిన ఒక అధికారిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. సభలకు భయపడి వెళ్లక పోవడంతో అధికారులు తొలగించారు.

ధర్మాపూర్‌లో ఆగ్రహం

మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్ గ్రామసభలో అధికారులకు ప్రజలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామసభలో అధికారులను నిలదీసి బండబూతులు తిట్టారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, కరెంట్ బిల్లులు, వంటగ్యాస్ సబ్సిడీ, కొత్త రేషన్ కార్డు జారీ, రూ. 4 వేల పింఛన్‌పై అధికారులను నిలదీశారు. గ్రామస్తులకు అధికారులు సర్ది చెప్పినా వినక పోవడంతో గ్రామసభను ముగించుకొని వెళ్లిపోయారు. దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలం రేకులపల్లి గ్రామంలో గ్రామస్తులు ఆగ్రహానికి అధికారులు గ్రామసభ నుంచి వెనుదిరిగారు. అర్హుల జాబితాలో అసలైన వారి పేర్లు లేవంటూ ఉట్కూరులో రాస్తారోకో నిర్వహించారు. మాగనూరు మండలం నేరేడుడం గ్రామంలో అర్హులపేర్లు జాబితాలో లేవని ఏకంగా గ్రామసభలు రద్దు చేస్తూ తీర్మానాలు చేశారు. అయిజ మున్సిపాలిటీలో సభను జనం బహిష్కరించారు. మిగతా చోట్ల కూడా గ్రామసభలు అర్ధాంతరంగా ముగించి వెళ్లి పోయారు. పాలబిల్లుల మాట ఏమైంది సార్ అంటూ వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో ఎమ్మెల్యే నారాయణ రెడ్డిని స్థానికులు ప్రశ్నించారు.

నేరడగంలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

బల్మూరు మండలం అనంతవరంలో నిలదీస్తున్న గ్రామస్తులు

ఇండ్ల రద్దుకు గ్రామస్తుల తీర్మానం

మాగనూరు, జనవరి 23 : మాగనూరు మండలంలోని నేరడగం, వడ్వాట్, పరమందొడ్డి, కొత్తపల్లి గ్రామాలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. అయితే నేరడగంలో 321మందికి సంబంధించిన ఇందిరమ్మ ఇండ్ల జాబితాను అధికారులు చదివివినిపిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. జాబితాలో అన్ని అవకతవకలు ఉన్నాయని వాటన్నింటినీ రద్దు చేయాలని గ్రామస్తులు తీర్మానం చేశారు. అనంతరం అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు తదితర పథకాలకు గతంలోనే దరఖాస్తులు చేసుకున్నాం కదా.. మళ్లీమళ్లీ చేసుకోవాలంటే ఎలా గని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపల్లి గ్రామంలో గ్రామసభలో మహిళలు సీఎం కేసీఆర్ ఉన్నప్పుడే రైతుబంధు అన్ని సక్రమంగా వచ్చేవని రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత ఏవీ సక్రమంగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ముసలివాళ్లకు ఇచ్చే పింఛన్లు కూడా సక్రమంగా ఇవ్వకుండా ఈ రేవంతోడ్డి వాళ్ల నోట్లో కూడా మన్ను కొట్టాడని చర్చించుకున్నారు.

మోమిన్‌పూర్‌లో రసాభాస

మద్దూర్ (కొత్తపల్లి)జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనర్హులకు పెద్దపీట వేశారంటూ గురువారం మండలంలోని మోమినాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో బీఆర్ఎస్ నాయకులు అధికారులు నిలదీయగా, కాంగ్రెస్ నాయకుల జోక్యంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. కాంగ్రెస్ పాలనలో సంక్షేమ పథకాలు అర్హులకు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే జాబితాలో పేర్లు ఉన్నాయని, వెంటనే అర్హులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య జరుగుతున్న వాగ్వాదం విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరుపార్టీల నాయకులను చెదరగొట్టి పోలీసు పహారా మధ్య గ్రామసభ నిర్వహించారు.

మద్దూరు మండలం మోమినాపూర్ గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వాగ్వాదం

ఇటిక్యాల మండలం నక్కలపల్లిలో నిలదీస్తున్న గ్రామస్తులు

హన్వాడ మండలం పెద్దదర్పల్లిలో..

దొడ్డిపల్లి ఫీల్డ్‌అసిస్టెంట్‌పై దాడి

- ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాలో పేర్లు లేవని స్థానికుల ఆగ్రహం

నవాబ్‌పేట, జనవరి 23 : నవాబ్‌పేట మండలం దొడ్డిపల్లి ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్(మేట్) పిచ్చకుంట్ల చంద్రయ్యపై ప్రజా పాలన గ్రామసభలో దాడి జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఎంపీడీవో జయరాంనాయక్ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. కాగా అదే గ్రామానికి చెందిన ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్(మేటీ) చంద్రయ్య ఆత్మీయభరోసా, రేషన్‌కార్డుల అబ్దిదారుల జాబితా చదువుతుండగా అదే గ్రామానికి చెందిన గజ్జి చంద్రయ్య కల్పించుకొని అనర్హులకు వివిధ పథకాలలో పేర్లు రాశారని, అసలైన లబ్ధిదారులకు మొండి చేయి చూపారంటూ తీవ్ర ఆగ్రహానికి గురై ఫీల్డ్‌అసిస్టెంట్‌పై దాడి చేశాడు. దీంతో గ్రామసభలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. పంచాయతీ కార్యదర్శిపై పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసేది లేక అధికారులు అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది మరోటని స్థానికులు రేవంత్ సర్కారుపై దుమ్మెత్తిపోశారు.

కొల్లాపూర్‌లో అధికార పార్టీ ఆగడాలు

- నర్సింహ ఆత్మహత్యాయత్నానికి వేధింపులే కారణం
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్ దవాఖానలో బాధితుడికి పరామర్శ

నర్సింహను పరామర్శిస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అభిలాష్‌రావు

నాగర్‌కర్నూల్, జనవరి 23 : కొల్లాపూర్ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ఇందుకు అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు డబ్బులు తీసుకొని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో మనస్తాపానికి గురైన బాధితుడు రేకులపాడు నర్సింహ బుధవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో సదరు నాయకుడి ఇంటి ముందు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనే ఇందుకు నిదర్శనమని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రేకుల పాడు నర్సింహను బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అభిలాష్‌రావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నర్సింహ భార్య, తల్లి, పిల్లలను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడేరు మండలం మైలారం గ్రామానికి చెందిన రేకుల పాడునర్సింహ, అతని అక్క నాగపూరి శివలీల, మరోకరి నుంచి సదరు నాయకుడు పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ పెద్దకొత్తపల్లిలో ప్లాట్లు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని వేధిస్తున్నాడన్నారు. ఆరేండ్లుగా ఇప్పుడు అప్పుడూ అంటూ కాలయాపన చేస్తూ వారు కొనుగోలు చేసిన ప్లాట్లు చూపకుండా, రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం వారి అరాచకానికి పరాకాష్ట అన్నారు. ఐదు రోజుల కిందట ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు పిలిపించి రోజు ఇంటికి తిప్పుకుంటున్నాడని కుటుంబ సభ్యులైన భార్య, తల్లి ఆరోపిస్తున్నారన్నారు. కూలీ పనులు చేసుకొని డబ్బు కూడబెట్టుకొని కొంత స్థలం కొనుగోలు చేసుకున్నందుకు డబ్బులు ఇస్తే రిజిస్ట్రేషన్ చేయకుండా ఇన్ని సంవత్సరాలుగా వేధించడం సరికాదన్నారు. రోజూ తిరుగుతున్నా పట్టించుకోకుండా ఉండడం తో అతడి ఇంటి ముందే పురుగు నివారణ మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంటే స్థానికులు జిల్లా దవాఖానకు తరలించారన్నారు. బాధితుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తే జిల్లా యంత్రాంగానికి కానీ, పోలీస్ యంత్రాంగానికి కానీ చీమకుట్టినట్లు లేదని మండిపడ్డారు. పెద్దకొత్తపల్లిలో పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి బంధువులు ఫిర్యాదు చేస్తే కేసు రిజిస్టర్ చేయలేదన్నారు. ఎవరి అండ చూసుకొని పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంత్రి అనుచరులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేదలు, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురిచేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా నర్సింహ కుటుంబానికి న్యాయం చేయాలని, దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్లాట్లకోసం పైసలిచ్చి ప్రాణం పోగొట్టుకోవడం ఏమిటని ఆకుటుంబం అడుగుతుంటే బాధ కలిగిస్తుందన్నారు. పెద్దకొత్తపల్లి ఎస్సై ఫిర్యాదు తీసుకొని స్పందించడం లేదన్నారు. సదరు ఎస్సైని సస్పెండ్ చేయాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా నిసిగ్గుగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దకొత్తపల్లి ఎస్సై సివిల్ పంచాయతీల్లో దూరుతూ, అలాంటి పోలీస్ అధికారిపై విచారణ జరిపించాలన్నారు. బుధవారం మధ్యాహ్నం జరిగితే ఇంత వరకు కూడా కేసు రిజిస్టర్ కాకపోవడం దురదృష్టకరమన్నారు.

అధికార పార్టీ అండ చూసుకొని చెలరేగిపోతున్నా నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అభిలాష్‌రావు, జిల్లా నాయకులు రాజ గౌడ్, వెంకటయ్య, రవినాయక్, కిషన్‌నాయక్‌తోపాటు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ దుష్టపాలన తారాస్థాయికి చేరింది

- దేవుండ్ల సాక్షిగా మోస పూరిత వాగ్దానాలు
- గ్రామసభల పేరుతో మరో మరు మోసం
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కు మల్, ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జనవరి 23 : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దుష్టపాలన తారాస్థాయికి చేరుకుందని వారికి రాబోయే కాలంలో ప్రజలే బుద్ధిచెబుతారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం అలంపూర్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు, తర్వాత దేవుళ్ల సాక్షిగా మోసపూరిత పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారెంటీల అమలు చేయకుండా ప్రస్తుతం గ్రామసభల పేరుతో కాలయాపన చేస్తుందన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో చిత్తుచిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ ఏ పథకమైనా కాంగ్రెస్ కార్యకర్తలకే ఇవ్వాలని ఏ హోదాలో అధికారులకు చెబుతున్నారని ప్రశ్నించారు. చాలా చోట్లా గ్రామసభల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులే గ్రామసభలో వేదికపై కూర్చుంటున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని, జనాభా గణన చేశారు, మళ్లీ ఇప్పుడు వేదికల మీద అర్హులకు న్యాయం చేస్తామని దరఖాస్తులు సేకరిస్తు ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి యేడాది దాటినా నేటికీ గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని గుర్తు చేశారు. గ్రామాలు చెత్తాచెదారంతో నిండిపోయాయని పారిశుధ్య చర్యలు చేపట్టే దిక్కులేదన్నారు. సంక్షేమ పథకాలు అందక ప్రజలు గోస పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో షికార్లు కొడుతున్నారని, ప్రభుత్వ ధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ మీద కేస్లు పెడితే పట్టించుకోని ప్రభుత్వం కేటీఆర్‌పై ఆరోపణలు చేయడం తగదన్నారు. రూ.50 లక్షల డబ్బుల బ్యాగుతో దొరికిన రేవంత్‌రెడ్డిపై కేసులు పెట్టి చార్జి షీట్ వేయాలన్నారు. ధరణిలో లొసుగుల పేరుతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు భూమాత పేరుతో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలు ముందుకు వచ్చి గ్రామసభలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తుందన్నారు. గ్రామసభల్లో అధికారులను నిలదీసే ప్రజలకు ఎవరు సమాధానం చెబుతారన్నారు. గ్రామాల అభివృద్ధికి సంవత్సర కాలంలో ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. సమావేశంలో అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, బీఆర్ఎస్ నాయకులు కిశోర్, రవి ప్రకాష్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి, నరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టి, మిషన్ భగీరథ కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బిల్ కలెక్టర్ సస్పెన్షన్

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 23 : నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న పావనిని సస్పెండ్ చేస్తున్నట్లు నాగర్‌కర్నూల్ కలెక్టర్ సంతోష్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని 13వ వార్డులో నిర్వహించిన నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు నిర్వహించిన గ్రామసభకు ప్రత్యేక అధికారిగా హాజరు కావాల్సిన బిల్ కలెక్టర్ పావని గైర్హాజరు కావడంతో విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

బతికుండగానే మా ప్రాణాలు తీయొద్దు

- ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి
- పెద్ద ధన్వాడ నిరాహార దీక్షలో రైతులు

నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న రైతులు

రాజోళి, జనవరి 23 : ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేసి తాము బతికుండగానే ప్రాణాలు తీయొద్దని పెద్ద ధన్వాడ గ్రామ రైతులు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పెద్ద ధన్వాడ గ్రామ శివారులో జీఆర్ఎఫ్ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రైతులు, గ్రామస్తులు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రాణాంతకమైన కంపెనీలు మాకు వద్దన్నారు. మా పంట పొలాలకు, ప్రజల ప్రాణాలకు కంపెనీతో ముప్పు పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టలేమని, ఎట్టి పరిస్థితుల్లోనూ కంపెనీ రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ తీర్మానం మేరకు నిరాహార దీక్షలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. తొలిరోజు వివిధ గ్రామాలకు చెందిన రైతులు దీక్షకు మద్దతు తెలియజేశారు. ఇథనాల్ కంపెనీ రాకుండా అడ్డుకొని తీరుతామని నినాదాలు చేశారు.